ట్లోని ప్రతి మొక్కకూ, పువ్వుకూ తెలుసు వాటినెవరు పెంచారో! సగం కోసిన ఉల్లిపాయ, నిమ్మకాయ, కాస్త వాడిన తోటకూర కట్టో లేక, పచ్చిమిరపకాయలో ఆయన కంట పడ్డాయా.. పనివాళ్ల ముందు పాఠాలు మొదలుపెడతారు.

ఆయనకు రిటైర్మెంట్ ఉందిరా.. మరి నాకేదీ? నిజానికి బాధ్యతలు నిండా ఉన్నప్పుడు కూడా ఇంతగా కుంగిపోలేదు. బాధ్యతలన్నీ తీరిన రిటైర్‌మెంట్ ఏజ్‌లో ఇలా కుశించిపోతున్నాను. ఎందుకో తెలుసా? అప్పుడు ఈ సలహాలు ఇంట్లో ఐదారు గంటలే వినిపించేవి. ఇప్పుడు రోజంతా వినాలి. ఇక ఈ బతికిన నాలుగు రోజులైనా 'రాధమ్మగా కాకున్నా.. కనీసం రాధికగానైనా బతకాలనుందిరా! పిచ్చిముండగా బతకాలనిలేదు రా'' అంటూ బిగ్గరగా ఏడ్చింది రాధిక.

అమ్మకంట ఎప్పుడూ కన్నీరు చూడని మహి, శేఖర్ తల్లడిల్లిపోయారు. ముగ్గురూ రాధికవైపు అలా చూస్తూ ఉండిపోయారు. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. ఆ రాత్రి ఏదో తిన్నామనిపించి నిద్రకు ఉపక్రమించారు. నాన్న అమ్మను తిడుతూ జోకులేస్తుంటే ఎన్నోసార్లు నాన్నతో కలిసి నవ్వుకోవడం గుర్తొచ్చి శేఖర్ బాధపడ్డాడు.

'అయ్యో! ఆడపిల్లను అయి ఉండీ అమ్మ మనసును అర్థం చేసుకోలేకపోయానే' అని మహిత గిలగిల్లాడింది.

కోర్టు నోటీసు ప్రకారం.. రేపు ఉదయం 10 గంటలకు కోర్టులో హాజరు కావాలి. మాధవరావు మారుమాట్లాడకుండా అన్నం తిన్నాడు. బాల్కనీలో కాసేపు అటూ ఇటూ నడిచాడు. భార్య ఇచ్చిన ట్యాబ్లెట్ వేసుకున్నాడు. సోఫాలోనే కూలబడి నిద్రపోయినట్టు కళ్లు మూశాడు.

రాధిక పనంతా కానిచ్చి బెడ్‌రూంలో మంచంపై పడుకుంది. నిద్ర రాకున్నా వచ్చినట్టే కొద్దిసేపు నటించి, భర్త కోసం ఎదురు చూసింది. మాధవరావూ అలాగే నటిస్తూ సోఫాలో చాలాసేపు కూర్చున్నాడు. రాధిక నిద్రపోయింది. కొద్దిసేపటికి మాధవరావు బెడ్‌రూంలోకి వచ్చి, చప్పుడు చేయకుండా రాధిక పక్కన పడుకున్నాడు. ముద్దబంతి లాంటి ఆమె నిండైన రూపును ముఖంలో ముఖంపెట్టి చూస్తున్న అతని ఆలోచనలు.. గతంలోకి జారుకున్నాయి.

* * *

అప్పుడు అతని వయసు 24. కొత్తగా ఉద్యోగంలో చేరాడు. వరహాలరావు మామయ్య పెళ్లికని కృష్ణదేవిపేట వెళ్లాడు. అక్కడే.. లంగా ఓణీలో, జారుజడతో, నుదుట సిందూర తిలకంతో సింపుల్‌గా ఉన్న రాధిక కనిపించింది. నగలతో ఆర్భాటంగా ఉన్న కన్నెలందర్నీ తప్పించుకొని అతని చూపులు రాధికపైన నిలిచిపోయాయి.

తర్వాత పెద్దలకు చెప్పడాలూ.. పెళ్లిచూపులు.

''ఎంత నిరాడంబరంగా, అందంగా ఉన్నావు. నా కోసమే పుట్టావు. నువ్వు రాధికవి. నేను మాధవుణ్ని. మనిద్దరం రాధామాధవులం'' అన్నాడు ప్రేమగా.

పెళ్లి ఘనంగా జరిగింది.

ఆ తరువాత నెమ్మది నెమ్మదిగా రాధిక అతనికి అనుగుణంగా మారిపోవడం మొదలైంది. మాధవరావు హోదాకు తగినట్టే పట్టుచీరలు కట్టింది. ఇష్టం లేకున్నా మెడనిండా నగలు వేసింది. చేతులు బంగారు గాజుల బరువెక్కాయి. ఇంట్లో అన్నీ ఖరీదైన పట్టుచీరలే.

''ఇవి వద్దండీ.. ఉక్కపోత! నాకు ఇష్టంలేదు'' అని ఆమె అంటే.. ''అంతా ఏసీయేగా! నీకెక్కడ ఉక్కపోస్తుంది? మన స్టేటస్‌కు తగినట్టు ఉండు'' అనేవాడు.

ఎప్పుడు క్యాంపునకు వెళ్లినా నగలు, పట్టుచీరలు తెచ్చేవాడు. అలా ఉండటమే బాగా చూసుకోవడం అనుకున్నాడు తను. ఆమెకు ఎలాంటి చీర ఇష్టమో.. ఏ రంగు ఇష్టమో ఎప్పుడూ ఆలోచించలేదు. భార్యలో తన స్టేటస్ అంతా కనిపించాలి అనుకున్నాడు.

ఏళ్లు గడుస్తున్నకొద్దీ అతని మాటల్లోనూ మార్పు వచ్చింది. రాధికను తక్కువ చేసి మాట్లాడటం మొదలైంది. రోజులో నాలుగు సార్లయినా 'పిచ్చిముండ' అనడం అతనికి అలవాటైంది. రాధిక ఆ మాటలు భరిస్తూ, అందరికీ అన్నీ అమర్చుతూ తన జీవితంలో తానంటూ మిగలకుండా, తన ఇష్టాయిష్టాలను పక్కన పెట్టి, కష్టమనుకోకుండా చిరునవ్వుతో ఇంటా, బయటా అన్నీ చక్కబెట్టింది. నవ్వు తాండవించే ఆ మోము వెనుక ఏదైనా బాధుందా అని ఆలోచించే తీరిక అతని మనసుకు లేకుండా పోయింది.

'మా రాధమ్మది బంగారు బతుకు' అనేవారు ఊళ్లో వారంతా. అదే నిజం అనుకున్నాడు అతను.

* * *

బయట ఒక్కసారిగా ఉరుములు – మెరుపులతో పెద్దగా వర్షం మొదలవడంతో ఉలిక్కిపడి గతం.. ఆలోచనల్లోంచి బయటికి వచ్చాడు మాధవరావు. కిటికీ వద్దకెళ్లి నిలబడ్డాడు. చల్లగాలికి వానజల్లు ముఖంపై పడింది. అతని మనసు నెమ్మదిగా విశాలంగా విచ్చుకుంటున్నది. వెనక్కి తిరిగి రాధిక వైపు చూశాడు. తన ప్రవర్తనకు తాను తొలిసారి నొచ్చుకున్నాడు. తనను తాను తప్పుబట్టుకున్నాడు. మంచం వద్దకు వెళ్లి నెమ్మదిగా రాధిక పక్కన చేరబడ్డాడు. తన ప్రవర్తన రాధికను ఎంతగా విసిగించిందో అని తలచుకొని సతమతమయ్యాడు. అతని మనసు పశ్చాత్తాపంతో నిండిపోయింది. అతని కళ్లవెంట రెండు కన్నీటి బొట్లు చెంపల మీదుగా జారాయి.

'రాధమ్మను.. ఆమె నిర్ణయాలను ఇకపై తప్పక గౌరవిస్తాను. తప్పక గౌరవించాలి' అని మనసులో గట్టిగా ముద్ర వేసుకున్నాడు. ఆమెపై చేయి వేసి నిద్రపోయాడు.

* * *

తెల్లవారింది.

శేఖర్, మహి రెడీ అవుతూ మధ్యమధ్యలో తల్లిని చూస్తూ.. ''అమ్మా.. వద్దమ్మా'' అని నచ్చజెప్పబోయి ఆగిపోయారు.

మాధవరావు బాధగా నింపాదిగా రెడీ అయ్యాడు.

రాధిక రెడీ అయ్యి బయటికి వచ్చింది. సాధారణమైన నీలం రంగు కాటన్ శారీ కట్టుకొంది. అందులో పట్టుచీర కంటే పదింతల అందం ఉందా అనిపించింది మాధవరావుకు. అందరూ వాకిట్లోకి నడిచారు.

కారు ఎక్కబోతున్న రాధికకు..

''రాధమ్మా..'' అని భర్త పిలుపు వినిపించింది.

నమ్మలేకపోయిన రాధిక గిరుక్కున వెనక్కి తిరిగింది. పశ్చాత్తాప హృదయుడై.. తన కళ్లల్లోకి ఆప్యాయంగా చూస్తున్న భర్తవైపు చూస్తూ నిశ్చేష్టురాలై నిలబడిపోయింది.ఇద్దరి కళ్లల్లో నీళ్లు. ఒకరికొకరు మసకబారి కనిపిస్తున్నారు.

''రాధమ్మా.. నువ్వు నా బంగారు తల్లివి. పిచ్చిముండవి కావు. నన్ను, పిల్లలను కంటికిరెప్పలా సాకిన అమ్మవి. పిల్లల్ని ప్రయోజకుల్ని చేసిన ఇల్లాలివి. ఇన్నాళ్లూ నీకు ఏమీ తెలీదన్న నా అహంకారం వల్లనో, చులకనభావం వల్లనో.. నాకు తెలీకుండానే నిన్ను చాలా బాధపెట్టాను. నీ పట్ల బండగా, మొండిగా మసిలాను. ఇప్పుడు మనసారా చెబుతున్నా.. సారీ రా! నీకు కష్టం కలిగించే పని ఇంకెప్పుడూ చేయను. ఇక నీ ఇష్టం. ఇకపై ఎప్పుడూ నీకు భిన్నంగా నడుచుకోను!'' అని స్పష్టంగా, స్థిరంగా చెప్పాడు మాధవరావు.

రాధిక వణుకుతున్న చేత్తో భర్త చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. ''కోర్టుకు వెళ్తున్నామని, ఆగిపొమ్మని ఇవ్వన్నీ చెబుతున్నారా?'' అన్నది.. బాధతో పూడుకుపోయిన చిన్నగొంతుతో.

''లేదు రాధమ్మా.. నీ ఇష్టానికి అడ్డు తగలనని చెప్పాను కదా. ఇప్పుడు నీకు మాటిచ్చాను. అదే చేస్తున్నాను. ఆ మాట ప్రకారమే కోర్టుకు వెళ్లాలన్న, నా నుంచి విడాకులు పొందాలన్న నీ ఇష్టాన్ని మనస్ఫూర్తిగా గౌరవిస్తున్నాను. ఇప్పుడు నువ్వు నాకు దక్కవేమోనన్న బాధ తప్ప, పరువు పోతుందన్న ఆలోచన ఏ కోశానా లేదు నాకు. బంధుమిత్రులు ఏమనుకుంటారో అన్న భయాలూ లేవు. నీ ఇష్టానికి అడ్డు తగలలేదన్న సంతృప్తి మిగిలితే చాలు'' అన్నాడు.. దుఃఖం నిండిన గొంతుతో.

''నేను మీపై ఏకేసూ వేయలేదు. ఇవి చిత్తు కాగితాలండీ.. మా ఫ్రెండ్ లాయర్ ఫాతిమా పంపిన కాగితాలు. వీటిపై కోర్టుముద్ర ఎక్కడైనా ఉందా చూడండి?'' అన్నది కళ్లలోకి నవ్వును తెచ్చుకుంటూ.

ఆ మాట విని మాధవరావు ఆశ్చర్యపోయాడు. అంతకుమించి అమితానందంతో సంబురపడిపోయాడు.

గేటు అవతలున్న డ్రైవర్ నందయ్యను దగ్గరికి రమ్మని పిలిచింది రాధిక. ''నందయ్యా! చెప్పు.. నిన్ను కారు ఎక్కడికి పోనివ్వమని చెప్పాను!?'' అనడిగింది.

''బీచ్ రోడ్డుకి మేడమ్. 'కాళికామాత ఆలయానికి వెళ్లి, అక్కణ్నుంచి సాయంత్రం వరకూ బీచ్‌లో గడుపుదాం!' అని చెప్పారు మేడం'' అన్నాడు డ్రైవర్.

ఈలోగా ఆ నోటీసును శేఖర్, మహి గబగబా తిరగేసి చూశారు. అందులో ఎక్కడా కోర్టుముద్ర లేదు. పిల్లలిద్దరూ ఆనందంతో అమ్మను రెండు చేతులతో గట్టిగా చుట్టేశారు.

''నిజమే నాన్నా.. మన రాధమ్మ మనందర్నీ పిచ్చివాళ్లని చేసింది'' అని నవ్వుతూ అన్నాడు శేఖర్.

''లేదురా.. నా రాధమ్మ నా పిచ్చి వదలగొట్టింది'' అన్నాడు మాధవరావు. ఆ మాటలకు అందరూ మనసారా నవ్వుకున్నారు. ■

## ఎల్ శాంతి



సాహిత్యం అనేది ప్రజల్లో సుహృద్భావం, సామరస్యం, సామాజిక చైతన్యం కలిగించటానికి దోహడపడాలన్నది రచయిత్రి ఎల్ శాంతి ఆకాంక్ష. వీరి స్వస్థలం విశాఖపట్నం జిల్లాలోని కృష్ణదేవిపేట. ప్రస్తుతం విజయవాడలో నివాసం ఉంటున్నారు. ప్రజాశక్తిలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకూ 14 కథలు రాశారు. ఐద్వా, వైజాగ్ ఫెస్ట్, విశాఖ సంస్కృతి, జాషువా సాంస్కృతిక వేదిక నిర్వహించిన కథల పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. సాహిత్య ప్రస్థానంలో ప్రచురితమైన 'కార్పొరేట్ అంబలి' కథకు.. సాహిత్య పురస్కారం లభించింది. బాలల కథలు, వ్యాసాలూ కూడా రాశారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం కథల పోటీలో పాల్గొనడం, బహుమతి పొందడం ఇదే తొలిసారి.